

కొత్తచెరువు గట్టు మట్టి మాయం

ప్రక్క భూమికి రోడ్డు నిర్మాణం.. చెరువు మట్టి యదేచ్ఛగా అమ్మకాలు పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రభుత్వ భూమి ఉందంటే చాలు కబ్జాదారుల కన్ను పడినట్లే, అడిగేవారే లేరన్నట్లుగా నిత్యం అక్రమణలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, అనే తేడా లేకుండా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆన్యాక్రాంతానికి గురవుతున్నాయి. చెరువు గట్టునే తీసేసి ప్రైవేట్ స్థలంకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆనందపురం మండలం రామవరం పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్- 86లో కొత్తచెరువు గట్టును మట్టి లేకుండా తొలిచేశారు. గత రెండు రోజులుగా ఈ తతంగమంతా జరుగుతున్నట్లు సుమారు 100 లారీలకు పైగా మట్టి బయటకు వెళ్లిపోయిందని తెలుస్తుంది. ఇంకొక విషయం ఏమిటంటే చెరువుగట్టును తీసేసి పక్క స్థలానికి కొత్తచెరువు గుండా రోడ్ నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రుణ మంజూరులో బ్యాంకులు సహకరించాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్వయం ఉపాధి పొందాలనుకునే అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని, ప్రత్యేక చొరవ చూపాలని, సులభతర విధానాలు పాటిస్తూ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. వివిధ సామాజిక వర్గాల ప్రజల నుంచి దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన క్లియర్ చేయాలని సూచించారు. స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి తగిన విధంగా అండగా నిలవాలని చెప్పారు. ఈ మేరకు ఎల్డీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు బ్యాంకు ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజక వర్గం శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా భీమిలి నియోజకవర్గంలో 389,500 రూపాయల సీఎం రిలీఫ్ చెక్కులను బాధితులకు అందించారు. భీమిలి నియోజకవర్గం భీమిలి మండలం టి నగరపాలెం గ్రామానికి చెందిన మరుపల్లి తేజ్ తన్వేష్‌కు 49,000 రూపాయలు, 3వ వార్డుకు చెందిన వియ్యపు రఘునాథ్ యాదవ్ కు 49,000 రూపాయలు, 8వ వార్డుకు చెందిన పాసి మురళికి 2,91,500 రూపాయలు చెక్కులు వారి బంధువులకు స్థానిక నాయకులతో కలిసి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అందజేసారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు , భీమిలి మండల పార్టీ అధ్యక్షులు డిఏఎన్ రాజు, టి.నగరపాలెం మాజీ సర్పంచ్ పొట్నూరు రాము, 8వ వార్డు అధ్యక్షులు గోపి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, సెక్రటరీ దొరబాబు, తెలుగు మహిళా నాయకురాలు మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ విగ్రహ ప్రతిష్టలో అదీప్ రాజ్

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజపాలెంలో శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు, 97వ వార్డు అధ్యక్షులు మెంతి మహేష్,పేరూరు చిన్నబాబు,రోమాల నూకరాజు, ఆకుల వాసు, చిప్పల చందు, సింహాచలం మాజీ ట్రస్ట్ సభ్యులు చందు యాదవ్, మహేశ్, పెందుర్తి మండలం వైస్ ఎంపీపీ చిరికి దేవుడు కనకరాజు, శివ, సంజీవ్, ప్రసాద్, బంగారి, తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్మశాన వాటికలో బోర్ వెల్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - పద్మనాభం: కొత్తపేట, కొండపేట, సంతపేట ప్రాంత వాసుల చిట్టివలస శ్మశాన వాటికలో వ్యాపారవేత్త ఉప్పల తాతాజీ ఆర్థిక సహాయంతో చిట్టివలస ప్రగతి పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోర్ వెల్ కొరకు శంకుస్థాపన భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జన్నుల రమణ మాట్లాడుతూ స్థానిక ప్రాంత అభివృద్ధిలో పాలు పంచుకుంటున్న దాతలకు, స్థానిక సమస్యల పరిష్కారాలకు తోడ్పడుతున్న స్థానిక ప్రజా ప్రతినిధులకు, సహకరిస్తున్న గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ కౌన్సిలర్ పిట్ట సురేష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి అందరి సహాయ సహకారాలతో మాత్రమే సాధ్య పడుతుందని, అందరూ తోడుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రంగూరి రాంబాబు, ఎర్నింటి వెంకటరమణ, వల్లా అప్పలకొండ, కమిటీ సభ్యులు నార్ల నాగభూషణం,చి న్ని, సత్తిబాబు నాయకులు నరవ రామారావు, తాటిపూడి అప్పలరాజు, మద్దిల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - మధురవాడ: మారికవలస సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈనెల 4వ తేదీ శుక్రవారం ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు విదద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మధురవాడ ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మారికవలస జంక్షన్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, శారదానగర్ కాలనీ, పీపి2 కాలనీ, మారికవలస గ్రామం, బోరవానిపాలెం, మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ, జేకె లేఅవుట్, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా వుండదన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఎక్సైజ్ ఏసీ

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహ లక్ష్మీనృసింహ స్వామివారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ జి.వెంకట స్వామి దంపతులు దర్శించుకున్నారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. పిదప వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్ స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట స్థానిక అధికారి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

'స్నేహ సంధ్య'ను సందర్శించిన ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: గంభీరం వద్ద స్నేహ సంధ్య ఏజ్ కేర్ వృద్ధుల ఆశ్రమాన్ని వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ గురువారం సందర్శించారు. నిర్వాహకులు నరేష్ కుమార్, సాంబశివరావులు సంస్థ ప్రత్యేకతలను వివరించారు. 150 బెడ్ల సామర్థ్యంతో వృద్ధులకు వసతి, వైద్యం, భోజనం వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు గురించి వివరించారు. దీనిపై స్పందించిన వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వృద్ధులకు అత్యంత ఆధునిక పరికరాలతో పునరావాసంతో పాటుగా చికిత్స కల్పించటం ఎంతో గొప్ప విషయమన్నారు.

గంటాకు ఆహ్వానం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహ లక్ష్మీనృసింహ స్వామి వారికి ఈనెల 8న జరిగే వార్షిక తిరు కల్యాణోత్సవం, 30న జరిగే అప్పన్న స్వామి నిజరూప దర్శనం చందనోత్స వాలకు హాజరు కావాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ ఈఓ కొమ్ముల సుబ్బారావు ఆహ్వానించారు. బుధవారం ఎమ్మెల్యే గృహంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అప్పన్నస్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను ఆలయ ఈవో ఎమ్మెల్యేకి అందజేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - గాజువాక : జీవీఎంసీ 79వ వార్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా జాయిన్ అయ్యే విద్యార్థులకు ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ దరఖాస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కాలేజీ గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ ప్రోత్సాహంతో ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ బాబు పర్యవేక్షణలో ఉత్తమ బోధనతో ప్రగతి పధములో నడుస్తుందన్నారు. కాలేజీలో చదువుకున్న విద్యార్థులు ఐఐటి ఎన్ఐటిలో సీట్లు పొందడం జరిగిందని, ప్రభుత్వం నుండి విద్యార్థులకు రావలసిన పథకాలు అన్ని వర్తిస్తాయి కావున అగనంపూడి పరిసర ప్రాంతంలో 10వ తరగతి పాసైన ఉత్సాహం ఉన్న విద్యార్థులు ఈ కాలేజీలో చేర్పించవలసిందిగా పేరెంట్స్‌ని కోరారు. కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు దివ్య, రికార్డ్ అసిస్టెంట్ హుస్సేన్, విద్యార్థుల పేరెంట్స్ హనుమంత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ 25వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : మే 10, 11 తేదీల్లో విశాఖలో నిర్వహించే సిపిఐ విశాఖ జిల్లా 25వ మహాసభను జయప్రదం చెయ్యాలని పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. మాధవదార సిపిఐ కార్యాలయంలో గురువారం జరిగిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమితి సమావేశంలో పైడిరాజు మాట్లాడుతూ మూడోసారి ప్రధాని మోదీ అధికారం చేపట్టిన తరువాత రాజ్యాంగం స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నదని విమర్శించారు. మతపరమైన అంశాలతో పాలన సాగిస్తూ ముస్లింలు, క్రైస్తవులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. పాలనలో మతాన్ని ఉపయోగించడం నేరమని రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ వక్ఫ్ బోర్డుకు నూతన చట్టం తీసుకొచ్చి కలతలు సృష్టించి భయభ్రాంతులకు గురిచెయ్యడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకస్తున్నదని తెలిపారు. నాగపూర్ లో ముస్లింలపై దాడులు చేసిన వారిని వదిలిపెట్టి దాడులకు గురైన ముస్లింల పైన తిరిగి కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ప్రపంచంలోనే అధిక జనాభా కలిగిన మన దేశంలో నిరుద్యోగం, ఆకలి చావులు కూడా అధికంగా ఉన్నాయన్నారు. రైతులకు నష్టం చేసి కార్పొరేట్లకు ఉపయోగపడే మూడు నల్ల చట్టాలు రద్దు చెయ్యాలని నాలుగు సంవత్సరాల నుండి ఆందోళన చేస్తున్న రైతులను చర్చల పేరుతో పిలిచి అక్రమంగా అరెస్టులు చేసి వారి నిరసన శిబిరాలను ధ్వంసం చెయ్యడం అన్యాయమన్నారు. ఇటువంటి అనేక ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక పాలన చేస్తున్న కేంద్రం ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రచారం చేస్తామని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్టంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఇళ్ళు లేని నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్ళు నిర్మాణానికి 5 లక్షలు ఉచితంగా మంజూరు చెయ్యాలని కోరారు. టిడ్కో ఇళ్ళుకు అన్ని వసతులు కల్పించి, ఎంపిక చేసిన లబ్ధిదారులకు అందజేయ్యాలని డిమాండ్ చేశారు. మాధవదార పార్టీ కార్యదర్శి గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు, కంచర పాలెం కార్యదర్శి వి.నల్లయ్య, కంచరపలెం మార్కెట్ నుకాలమ్మ, మర్రిపాలెం పార్టీ కార్యదర్శి కూన కృష్ణారావు, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, ఎన్.అప్పన్న, ధనలక్ష్మి, సూరిబాబు, ఆదినారాయణ, సత్యవతి, అమ్మోరు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ నేత కసిరెడ్డి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: సీపీఐ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని గాజువాక నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ గాజువాక నియోజక వర్గ సీపీఐ సమితి సమావేశం తాండ్ర కనక రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సంద ర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లా డుతూ గాజువాక నియోజక వర్గంలో సిపిఐ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరు సాగిస్తుందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం స్థలం కేటాయిం చాలని, టిడ్కో గృహాలలో కనీస సౌకర్యాలు మెరుగు పరిచి, లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లను అలాట్ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో 35ఏళ్లుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన సిపిఐ నాయకులు కడిమి రాజ బాబును సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, తాండ్ర కనక రాజు, కడిమి రాజ బాబు, అప్పారి విష్ణు మూర్తి, పి.దుర్గా రావు, కె.పోతయ్య, కె.వనజాక్షి, వై.దేముల్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-సాగర్‌నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో ఎండాడకు చెందిన పత్తి మురళి గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న విషయాన్ని ఎనిమిదవ వార్డు వార్డు అధ్యక్షుడు చెట్టు పెల్లి గోపి భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు దృష్టికి తీసుకెళ్లారు. గంటా శ్రీనివాసరావు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చెక్కు రూపంలో గురువారం గంటా నివాసంలో పత్తి మురళికి గంటా శ్రీనివాసరావు, బిజెపి విష్ణుకుమార్ రాజు చేతుల మీదుగా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లోడగల అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శించిన కూటమి ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ స్వయంకృషి నగర్‌లో ప్రేమోన్మాది నవీన్ దాడి సంఘటనలో తీవ్రంగా గాయపడి విశాఖ మెడి కవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నక్కా దీపికను గురువారం ఉదయం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజుతో కలిసి పరామర్శించారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పి, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను గంటా కోరారు. ఇప్పటికే నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారని కఠినంగా శిక్షించేలా పోలీసులు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యేలు తెలిపారు. బాధితురాలు కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

పేదల పక్షానే సీపీఐ పోరాటం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 63వ వార్డు కాకర్లయ గ్రామంలో ఎంవి త్రినాథ్ ఇంటి వద్ద సీపీఐ కాకరలోవ శాఖ మహాసభలు జరిగాయి. ఈ మహాసభకు ఎస్.లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ మహాసభకు సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ , గుడాల రాంబాబు, కాకరలోవ శాఖ కార్యదర్శి ఎన్వి త్రినాథ్ హాజరై మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరములు పూర్తయిన సందర్భంగా ప్రతి పార్టీ సభ్యుడు పార్టీని బలోపేతం చేయడానికి హుండీలు ప్రతి సభ్యుడికి అందజేయడం జరిగిందన్నారు. మరి ముఖ్యంగా పేద బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరము పనిచేస్తున్న సిపిఐ సేవలు మరువలేనివని అన్నారు. ఈనెల 11వ తేదీన సీపీఐ పార్టీ వార్షికోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో ఉన్న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, కేంద్ర కార్యదర్శి కే.నారాయణ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కావున పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న పార్టీ సభ్యులు సానుభూతిపరులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో విశాఖ జిల్లా సమితి సభ్యులు గుడాల జయ, సభ్యులు టి.రాధామణి, రమా, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు నష్టం కలిగించే ఫైనాన్స్ బిల్లును రద్దు చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జె అచ్యుతరావు

విశాలాంధ్ర - విశాఖ: పార్లమెంటులో ఇటీవల ఆమోదించిన ఫైనాన్స్ బిల్లును రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి ఎస్ జె అచ్యుతరావు డిమాండ్ చేశారు. బి.ఎస్.ఎన్.ఎల్. జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద గురువారం బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. లోక్ సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025 - 26 ఫైనాన్స్ బిల్లు ప్రవేశపెడుతూ 1972 సిసిఎస్ పెన్షన్ రూల్స్ మార్పు చేశారని, భవిష్యత్తు పే రివిజన్లో పే కమిషన్ అమలు జరిపిన నాటి నుండి మాత్రమే రిటైర్డ్ ఉద్యోగులకు రివిజన్ ఉంటుందని పేర్కొన్నారని తెలిపారు. దీని వల్ల దేశంలో కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు 65,000 మందికి, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల 1,75,000 మందికి పెన్షన్ల వ్యత్యాసాలు ఏర్పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. అత్యున్నత న్యాయస్థానాలు అనేక తీర్పులు ఇచ్చినప్పటికీ వాటన్నిటిను తుంగలోకి తొక్కి సీనియర్ సిటిజన్లు అయిన రిటైర్ ఉద్యోగులను బిజెపి ప్రభుత్వం ఇబ్బందులు గురి చేస్తున్నదని అన్నారు. రిటైర్డు ఉద్యోగులందరూ దేశవ్యాప్త నిరసన తెలియజేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి కె.సోమ సుందర్, ఎస్.ఎన్.పి.డబ్ల్యు.ఏ. జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతి వ్యక్తి భాగం కావాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతి వ్యక్తి భాగం కావాల్సిన అవసరం ఉందని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హ్యూమన్ రిసోర్సెస్) డైరెక్టర్ కె.సురేష్ శెట్టి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్మెంట్ విభాగం, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అండ్ సోషల్ ఈక్వాలిటీ, రోడ్ మ్యాప్ టువర్డ్స్ డెవలప్డ్ ఇండియా బై 2047 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలు అందరికీ అందుబాటులో ఉంచడం, అందరూ వీటిని పొందే విధంగా చూడటం, బాధ్యతయుతమైన సేవలు అందించడం, సకాలంలో సేవలు అందించడం అనే ఈ నాలుగు ప్రధానమైన అంశాలను పరిగణలోకి తీసుకొని ఆర్థిక సేవలు ప్రజలందరికీ చేరువ కావాల్సిన అవసరాన్ని వివరించారు. వైవిధ్యత కలిగిన భారత దేశంలో రాష్ట్రాల వారీగా కొంత వ్యత్యాసం ఉందని వీటిని సమతుల్యం చేస్తూ అందరిని అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, ఆర్థికపరమైన సేవలు అందరికీ చేరువ చేయడం ఎంతో అవసరమని చెప్పారు. అనంతరం సదస్సుయొక్క సావనీర్‌ను విసి ఆచార్య జి.పి రాజశేఖర్ అతిధులతో కలసి విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజినెస్ అండ్ ఆపరేషన్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, సదస్సు కన్వీనర్ ఆచార్య జాలాది రవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ.నరసింహారావు , సదస్సు సహకన్వీనర్ డాక్టర్ పి.సుబ్బారావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో అభినందన కార్యక్రమం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 2024-25 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ 82.62 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ చేసి, నూతన రికార్డ్‌ను నెలకొల్పింది. పోర్ట్ ఈ ఘనతను సాధించడంలో భాగస్వాములైన వారిని ప్రత్యేకంగా అభినదించేందుకు ఈ సమావేశాన్ని పోర్ట్ బోర్డు రూంలో గురువారం నిర్వహించారు. ఉద్యోగుల సంఘాలు, స్టీవడోర్లు, టెర్మినల్ ఆపరేటర్లు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ సంస్థలు, దిగుమతిదారులు, ఎగుమతిదారులు, కార్మిక సంఘాలు, పోర్ట్ వ్యాపార వర్గాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్ పర్సన్ డా.అంగముత్తు మాట్లాడుతూ ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, ఇతర స్టేక్‌హోల్డర్లు అందరి సహకారం, అంకితభావం, కృషి వల్లనే పోర్ట్ గత ఆర్థిక సంవత్సరపు రికార్డును అధిగమించి నూతన రికార్డ్‌ను నెలకొల్పిందని అన్నారు. ఈ విజయాన్ని సాధించడం వెనుక విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉందని ఈ విజయం అందరికీ చెందుతుందని ఆయన వెల్లడించారు. ఉద్యోగులు, స్టీవడోర్లు, టెర్మినల్ ఆపరేటర్లు, పీపీపీ భాగస్వాములు, దిగుమతిదారులు, ఎగుమతిదారులు, కార్మిక సంఘాలుప్రతి ఒక్కరి కృషి ఎంతో కీలకం అని అన్నారు. పోర్ట్ పనితీరును మెరుగుపర్చేందుకు, వాణిజ్య వృద్ధికి తోడ్పడేందుకు భారత ప్రభుత్వ పోర్ట్స్, షిప్పింగ్ వాటర్‌వేస్ మంత్రిత్వ శాఖ, స్థానిక యంత్రాంగం, కస్టమ్స్, రైల్వే శాఖలు అందించిన మార్గదర్శకత, సహకారాన్ని అభినందించారు. విశాఖపట్నం పోర్ట్ తన సామర్థ్యాన్ని మరింత పెంచుకుని 2025-26 ఆర్థిక సంవత్సరానికి 90 కార్గో టార్గెట్ సాధించేందుకు కట్టుబడి ఉందని, దేశంలో మేజర్ పోర్టులలో అగ్రశ్రేణి లో కొనసాగేందుకు నిరంతరం కృషి చేయాలని చైర్ పర్సన్ పిలుపునిచ్చారు. పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

పాపయ్యరాజుపాలెంలో శ్రీ నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయం పునః ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామ పెద్దలు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే,టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు,పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్,ఏపీ ఆయిల్ సీడ్స్ చైర్మన్ గండి బాబ్జి,మరియు బిజెపి నేత,స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు,పాల్గొని అమ్మవారికి ప్రత్యేక అభిషేక హోమం పూజలు చేసి,అమ్మవారిని దర్శించుకొని,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు,కార్యక్రమంలో గ్రామ పెద్దలు,పేరూరి చినబాబు,రోమాల నూకరాజు,రోమాల శ్రీను,రోమాల సన్నీ,గ్రామ యువత,మరియు కూటమి నాయకులు అయిత ఎర్నిబాబు,చీర అప్పలరాజు కెవిఆర్ లక్ష్మి,భవాని, భక్తులు తదితరులు పాల్గొన్నారు

బస్‌స్టాప్‌లలో రూట్ మ్యాప్‌లు ఏర్పాటు

ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు, బస్సులు ఏ రూట్లో ఏ దారిలో వెళ్తున్నాయో తెలిపే విధంగా రూట్ మ్యాప్‌లను అన్ని బస్టాపుల్లో ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు తెలిపారు. గురువారం అయన పలు డిపోలను తనిఖీ చేశారు. ప్రయాణికులకు రూట్లు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు, సూపర్వైజరులు సిబ్బందిని సమావేశపరిచి, విశాఖపట్నం డిపోలో పరిశుభ్రత మరింత మెరుగు పడాలని పాసింజర్లను, ప్రయాణికులను ఆకట్టుకునే విధంగా సమయపాలన పాటించాలన్నారు. మార్గమధ్యలో ప్రయాణి కులతో మర్యాదపూర్వకంగా నడుచుకొని ఆర్టీసీకి మరింత ఆదాయం పెంచాలన్నారు. భద్రాచలం- విజయ వాడ బస్సులకు మరింత ఆదాయం వచ్చునని తెలియ జేసియున్నారు. ఈరోజు నుండి విశాఖపట్నం డిపోలో దూర ప్రాంతాలకు అంతరాష్ట్ర సర్వీసులకు కొత్త బస్సులు వేయడం జరిగిందని తెలిపారు . డ్రైవర్లు కండక్టర్లు టీంగా మరింత ఆదాయము విశాఖపట్నం డిపోకి తేవాలన్నారు. బస్సుల రిపేర్లు ఎప్పటికప్పుడు చేయాలని కొత్త బస్సులు బిఎస్సి వారికి కొత్త టెక్నాలజీతో టూల్స్ సప్లై చేసి కిందను ఆదా చేయాలని తెలిపారు. ఈ వేసవి కాలంలో ప్రతి ఒక్కరికి కూడా సన్ స్ట్రోక్‌కు గురి కావద్దని ఎప్పటికప్పుడు మజ్జిగ మంచినీళ్లు తీసుకొని బస్ స్టేషన్ డిపోల్లో త్రాగునీటి సదుపాయము మరింత అధికము చేసి సిబ్బంది ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.రాజశేఖర్, డిపో మేనేజర్ కె.గంగాధర్, అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ ఎమ్మెస్ రావు, ఎస్ఎస్ అప్పారావు, అసోసియేషన్ నాయ కులు, డ్రైవర్లు, కండక్టర్లు గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సరకు రవాణాలో దూసుకుపోతున్న పోర్ట్

- విశాఖపట్నం పోర్టులోకి అతిపెద్ద బాక్సైట్ నౌక రాక

విశాలాంధ్ర-విశాఖ సిటీ: నగరంలో ఉన్న వేదాంత అల్యూమినియం యూనిట్ వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ ప్రైవేట్ లిమిటెడ్ (వీజీసీబీ) భారతీయ నౌకాశ్రయ రంగంలో కొత్త మైలురాయిని చేరుకుంది. దేశంలో ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద బాక్సైట్ నౌకలలో ఒకటైన ఎంవీ కెప్టెన్ లియోనిడాస్‌ను విజయవంతంగా బెర్త్ చేసింది. ఈ నౌక 199,500 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ను తీసుకువచ్చింది. ఇది పోర్ట్ కార్గో నిర్వహణ సామర్థ్యాన్ని పెంచింది. ఎంవీ కెప్టెన్ లియోనిడాస్ విజయవంతంగా చేరడం విశాఖపట్నం పోర్ట్‌ను అంతర్జాతీయ బాక్సైట్ వ్యాపారంలో ప్రధాన కేంద్రంగా మార్చడానికి తోడ్పడుతుంది. గత ఏడాది ఎంవీ హువాహైన్ నౌక వీజీసీబీ టెర్మినల్‌లో విజయవంతంగా చేరింది. 199,900 మెట్రిక్ టన్నుల మ్యాంగనీస్ ఓర్ ను డెలివరీ చేసింది. ఇది భారతదేశంలోని ఏ పోర్ట్‌కైనా వచ్చిన అతిపెద్ద సింగిల్-కార్గో షిప్‌మెంట్‌గా నిలిచింది. ఆధునిక సాంకేతికతలలో పెట్టుబడులు పెట్టడం, సమర్థవంతమైన కార్యకలాపాలు చేపట్టడం ద్వారా విశాఖపట్నాన్ని ప్రముఖ అంతర్జాతీయ ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌గా మరింతగా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా వీజీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ చిక్కాల సతీష్ కుమార్ మాట్లాడుతూ ఈ మైలురాయి మాకు గొప్ప గౌరవాన్ని కలిగించిందన్నారు. భారతదేశ నౌకాశ్రయ రంగానికి మా సహకారాన్ని కొనసాగిస్తూ, ఇంత భారీ కార్గోను కేవలం ఐదు రోజుల్లో దిగ్విజయంగా అన్‌లోడ్ చేయడం గొప్ప సాధనంగా భావిస్తున్నామన్నారు. ఇది మా ఆపరేషనల్ ఎక్సలెన్స్‌కు నిదర్శనమన్నారు.

ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రుల కోసం ప్రత్యేక పుస్తకం తీసుకువచ్చిన ముగ్గ కల్రా

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆటిజం పట్ల అవగాహన మాసం ఏప్రిల్ నెల లో నిర్వహిస్తోన్న వేళ, సమ్మిళిత విధానాలు, ముందస్తు జోక్యం, సంరక్షకుల శ్రేయస్సు వంటి అంశాల పట్ల అవగాహన కలిగించేందుకు ఆటిజం మాసం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 1970లో ఆటిజం సొసైటీ ఆఫ్ అమెరికా ప్రారంభించగా, ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవంగా ఏప్రిల్ 2 ను (ఐక్యరాజ్యసమితి గుర్తించింది) ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం, "వ్యత్యాసాలు వేడుక చేయండి". నేపథ్యం తో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇళ్ళు, పాఠశాలలు, కార్యాలయాలు సమాజాలలో న్యూరో వైవిధ్యాన్ని స్వీకరించడాన్ని, సమ్మిళిత పర్యావరణ వ్యవస్థ సృష్టిని ఇది ప్రోత్సహిస్తుంది. ఈ దినోత్సవం పురస్కరించుకుని, ముగ్ధ కల్రా రాసిన "ఐ సీ యు, ఐ గెట్ యు: ది సెల్ఫ్-కేర్ గైడ్ ఫర్ స్పెషల్ నీడ్స్ పేరెంట్స్" అనే సంచలనాత్మక పుస్తకంను ఆవిష్కరించింది బుకోస్మియా సంస్థ. బెంగళూరులో జరిగిన ఇండియా ఇంక్లూజన్ సమ్మిట్, ఇండియన్ న్యూరో డైవర్సిటీ సమ్మిట్ సందర్భంగా విడుదల చేయబడిన ఈ పుస్తకం కుటుంబాలు, విద్యావేత్తలు మరియు యజమానులకు అత్యుత్తమ సహచరునిగా నిలువనుందని ముగ్ధ చెప్పారు. ఈ పుస్తకం వైవిధ్యభరితమైన పిల్లల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న భావోద్వేగ, ఆర్థిక, సామాజిక సవాళ్లను చర్చిస్తుంది. ముఖ్యంగా భారతదేశంలో, వ్యవస్థాగత మద్దతు సరిపోదని ముగ్ధ చెబుతూ తన వ్యక్తిగత అనుభవాలను కూడా జోడించారు. ఆచరణాత్మక వ్యూహాలు, పరిజ్ఞానం అందిస్తూనే, సంరక్షకులు తమ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వమని ఈ పుస్తకం ప్రోత్సహిస్తుంది. "కార్పొరేట్లు సంరక్షకులను నియమించుకున్నప్పుడు, వారు మొత్తం కుటుంబాలను మరింత స్థిరమైన, సంతృప్తికరమైన జీవితాలను గడపడానికి శక్తివంతం చేస్తారని ముగ్ధ వివరించారు.

నేడు కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తులు పరిశీలన ఇంటర్వ్యూ

విశాలాంధ్ర-పద్మనాభం: పద్మనాభం మండలం ఎంపీడీవో కార్యాలయం వారు తెలిపిన వివరాలు మేరకు 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు సంబందించి బి.సి, కాపు బ్రాహ్మిన్, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈ.బి.సి కార్పొరేషన్ ల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల క్రింద వివిధ రకముల యూనిట్లను బ్యాంకు ఋణములు మరియు సబ్సిడీ ద్వారా మంజూరు చేయు నిమిత్తం పద్మనాభం మండల పరిధిలో గల 22 గ్రామ పంచాయతీల నుండి 366 మంది లబ్ధిదారులు పెట్టుకున్న ధరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయు నిమిత్తం ఇంటర్వ్యూ లు తే 04.04.2025 శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి పద్మనాభం మండల పరిషత్ కార్యాలయం నందు సంబంధిత బ్యాంకు మేనేజర్స్ మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, బి.సి. కార్పొరేషన్ అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు ఇంటర్వ్యూ లు జరుపబడును. కావున స్వయం ఉపాధి క్రింద ఋణముల కొరకు ధరఖాస్తులు పెట్టుకున్న లబ్ధిదారులు 3 సెట్స్ ధరఖాస్తులు అనగా (ఆన్ లైన్ లో పెట్టుకున్న ధరఖాస్తు) మరియు ఆధార్ కార్డు జెరెక్స్, రేషన్ కార్డు జెరెక్స్, కుల ధృవ పత్రం జెరెక్స్, ఆదాయ ధృవ పత్రం జెరెక్స్, వాహనాలు గురించి పెట్టుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్ జెరెక్స్ 3 సెట్స్ మరియు ఒరిజినల్ ఆధార్ కార్డు, రేషన్ కార్డు,కుల ధృవ పత్రం, ఆదాయ ధృవ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని పద్మనాభం మండల పరిషత్ కార్యాలయమునకు తే 04.04.2025 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు ఇంటర్వ్యూ లకు హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది.

శ్రీ పెంటమాంబ అమ్మవారి మహోత్సవాలకు తొలి పూజ ప్రారంభం

విశాలాంధ్ర-పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతి, ఉక్కు నిర్వాశితుల ఆరాధ్య గ్రామ దేవత ఐన శ్రీ పెంటమాంబ అమ్మవారి పండుగ ఈ నెల 14 వ తేదీన జరుపుతున్న సందర్భంగా నెల్లిమక్కు లో బుధవారం రాత్రి శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఘటలా తొలి పూజ లో నెల్లిముక్కు గ్రామ పంచాయతీ గ్రామస్తులు, దొడ్డి పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గోని పూజలు చేశారు. గురువారం సాయంత్రం నుండి పదమూడో తేదీ ఆదివారం వరకు అమావార్ల ఘటాలు పుర విధుల్లో ప్రదర్శన చేస్తారని, పదనాలుగో తేదీ శ్రీ పెంటమాంబ అమ్మవారి పండుగ, పదిహేనో తేదీన శ్రీ కుంచుమాంబ అమావారి అనుపు మహోత్సవాలు తో పండుగలు ముగుస్తాయని గ్రామ పెద్దలు, అమ్మవారి భక్తులు ఈ సందర్భంగా తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులు, గాజువాక నియోజక వర్గం ప్రజలు, నిర్వాశితులు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనం చేసుకుంటారని తెలిపారు, దీనికి సంబందించి పండుగ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియ జేసారు.

మధురవాడలో

రక్త మోడుతున్న రహదారులు...

కాంక్రీట్ లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి

విశాలాంధ్ర -పీ ఎం పాలెం : మధురవాడ ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాలతో రక్తమోడుతున్నాయి. జాతీయ రహదారి వెంబడి నిత్యం ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. అధిక ట్రాఫిక్ తోపాటు చిన్న రహదారులు కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గురువారం ఉదయం లారీ (కాంక్రీట్ మిక్సింగ్) డ్రైవర్ నిర్లక్ష్యంతో యువకుడు మృతిచెందిన ఘటన స్థానికులను కలచివేసింది. మధురవాడ సాయిరాంకాలనీకి చెందిన బలగా ప్రభాకర్ (49) తన ద్విచక్ర వాహనంపై భవన నిర్మాణ కార్మికులైన ఎల్.కామేశ్వరరావు (42)తో కలిసి తగరపువలసలో బిల్డింగ్ పనుల కోసం వెళుతుండగా మారికవలస జంక్షన్ లో గురువారం రెడీమిక్స్ లారీ డ్రైవర్ వెనుక నుండి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో బలగ ప్రభాకర్ (49) అక్కడక్కడ మృతి చెందారు. గాయాలపాలైన ఎల్ కామేశ్వర రావు(42)ను కేజీహెచ్ కు తరలించారు సంఘటన స్థలానికి చేరుకున్న పీ.ఎం.పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని 5 వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు తదితరులు పరామర్శించి కేజీహెచ్ లో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించారు.

క్వాలిటీ వాల్ యొక్క కొత్త బ్రాండ్, గోల్డెన్ స్వాన్ ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం: విస్తరణకు గణనీయమైన అవకాశాలతో ఐస్ క్రీమ్ వర్గం భారతదేశంలో వేగంగా పెరుగుతోందని క్వాలిటీ వాల్ ఐస్ క్రీమ్ బిజినెస్ హెడ్ టోలోయ్ టాన్రిదాగ్లీ హుల్‌అన్నారు. ఈ వర్గాన్ని అందరికీ ఆనందదాయకంగా మార్చాలనే ఆశయంతో, క్వాలిటీ వాల్ గోల్డెన్ స్వాన్ ను ప్రారంభించిందన్నారు. భారతదేశం డెజర్ట్‌లకు భారీ మార్కెట్ ఐస్ క్రీములు, స్తంభింపచేసిన డెజర్ట్‌ల వర్గం తక్కువగా ఉందని, పెరుగుతున్న కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు ఇంటి రిఫ్రిజిరేటర్ చొచ్చుకుపోవటంతో, వృద్ధికి భారీ అవకాశం ఉందన్నారు. గోల్డెన్ చెంచా ద్వారా, క్వాలిటీ వాల్ ఈ సామర్థ్యాన్ని నొక్కడం, విభిన్న వేసవి ఆనందాలను ప్రవేశపెట్టడం ద్వారా విస్తృత వినియోగదారులతో కనెక్ట్ అవ్వడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.ఆల్ టైమ్ క్లాసిక్స్ నుండి బోల్డ్ ఇన్నోవేషన్స్ వరకు క్వాలిటీ వాల్ గోల్డెన్ స్వాన్ నాలుగు ఇర్రెసిస్టిబుల్ ఎంపికలను అందిస్తుందన్నారు.

హ్యావ్‌మోర్ కొత్త ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశం అత్యంత ఇష్టపడే ఐస్ క్రీమ్ బ్రాండ్లలో ఒకటైన లాట్టే వెల్‌ఫుడ్ కంపెనీ లిమిటెడ్‌లో భాగమైన హ్యావ్‌మోర్ ఐస్‌క్రీమ్ ప్రజలు మరింత కోరుకునేలా చేసే అద్భుతమైన రుచి, క్రీమీ ఆనందాన్ని అందిస్తూ 'సో టేస్టీ, యు వన్నా మోర్' అంటూ సరికొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. సరదాగా ఉండే ఈ ప్రచారం బ్రాండ్ సొంతమైన ఆనందాన్ని నొక్కి చెప్పడమే కాదు తన పేరు హ్యావ్‌మోర్ ని తెలివిగా ప్రతిధ్వనింప జేస్తుందని హ్యావ్‌మోర్ ఐస్ క్రీం మేనేజింగ్ డైరెక్టర్ కోమల్ ఆనంద్ చెప్పారు. క్రికెట్ ఐకాన్ హార్దిక్ పాండ్యాకు తోడుగా బాలీవుడ్ సెన్సేషన్ తమన్నా భాటియాను తన సరికొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా స్వాగతిస్తూ హ్యావ్‌మోర్ తన తళుకుల ప్రచారాన్ని మరో స్థాయికి తీసుకెళ్తోందన్నారు. హార్దిక్ పాండ్యా డైనమిక్ ఎనర్జీ, మాస్ అప్పీల్ ఇప్పటికే ఆయనను బ్రాండ్‌కు పర్ఫెక్ట్ ఫిట్‌ను చేసిందని, ఇప్పుడు తమన్నా రాకతో మేము క్రికెట్, బాలీవుడ్ అభినేతలను ఒక్క చోటుకు తీసుకొస్తున్నాం అన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త డబ్బీరు వెంకటరావు మృతి

అశ్రునయనాలతో నివాళులర్పించిన వేలాది మంది ప్రజలు

విశాలాంధ్ర-పెందుర్తి: జీవీఎంసీ 95 వ వార్డు చింతల అగ్రహారం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త డబ్బిరు వెంకటరావు గురువారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. సేవా తత్పరుడుగా ఆధ్యాత్మికవేత్తగా ఈ ప్రాంత ప్రజలకు చిరపరిచితుడైన వెంకట్రావు మృతి వార్త తెలుసుకున్న చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు వేలాదిమంది ఆయన నివాసానికి చేరుకుని అశ్రు నైనాలతో నివాళులర్పించారు. పార్టీలకతీతంగా పలువురు రాజకీయ ప్రముఖులు, వ్యాపారస్తులు, ప్రజా సంఘాల నాయకులు, అధికారులు వెంకట్రావు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఏపీ సీడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు గండి బాబ్జి, 95 వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, జనసేన నాయకులు సేనాపతి లీలాధర్, ఆల్ ఇండియా శిష్ట కరణాల సంఘం అధ్యక్షుడు కృష్ణారావు రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్, జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు సహా పలువురు జీవీఎంసీ కార్పొరేటర్లు సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు డబ్బీరు మృతదేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మికంగాను, పేదలకు సహాయపడటంలోనూ వెంకటరావు అందరికంటే ముందు వరుసలో ఉండే వారిని అలాంటి వ్యక్తి అకాల మరణం చెందడం విచారకరమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు నాయకులు వెల్లడించారు.

పద్మనాభం మండల బిజెపి ఇన్చార్జి 'రూపాకుల' కు సన్మానం

విశాలాంధ్ర-పద్మనాభం: భారతీయ జనతా పార్టీ పద్మనాభం మండల శాఖ ఇన్చార్జిగా నియమితులైన రూపాకుల రవికుమార్ ను మండల బిజెపి అధ్యక్షులు తమటపు నాగమణి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఘనంగా సత్కరించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు పరశు రామరాజు ఆదేశాల మేరకు మండల ఇన్చార్జిగా నియామకమైన రవికుమార్ గురువారం పద్మనాభం విచ్చేసిన సందర్భంగా మండల ముఖ్య కార్య కర్తల సమావేశాన్ని పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. తమటపు నాగమణి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మండల అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర బిజెపి కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, మండల బిజెపి ఉపాధ్యక్షులు మత్స సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు సిరిపురపు వెంకటరావు, కలగర్ల పేర్రాజు, కార్యదర్శి మరగడ గౌరిరెడ్డి, తదితరులు మండల ఇన్చార్జి రవికుమార్ కి పుష్పగుచ్చం అందజేసి, దుస్సాలవతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ పద్మనాభ మండలం లో బిజెపి ఎదుగుదలకు పార్టీ కార్యకర్తలు అందరూ కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో బాబు జగజీవన్ రావు జయంతి, బిజెపి 46 ఆవిర్భావ దినోత్సవం, అంబేద్కర్ జయంతి, తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతవరం పంచాయతీ బిజెపి క్రియాశీల సభ్యులు చప్ప కృష్ణ, రేవిడి పంచాయతీ బిజెపి కార్యకర్త రెల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ హ్యాకథాన్‌లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఆనందపురం: కస్తూర్బా గాంధీ బాలిక విద్యార్థులు రాష్ట్రస్థాయి లో జరిగిన కంప్యూటర్ కోడింగ్ నైపుణ్యాలు నేర్పించే అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ హ్యాకథాన్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నం హోటల్ గ్రీన్ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొనగా కేజీబీవీ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఎల్.శకుంతల, బి.లేఖ్య, ఎల్.శశికళ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతిని గెలుచుకున్నారు. దీనికి ఫెసిలిటేటర్‌గా పాఠశాల మ్యాథ్స్ ఉపాధ్యాయిని హైమావతి హ్యాకథాన్ కోర్స్ కంప్లీట్ చేసి నవంబర్ నెల నుండి విద్యార్థులకు తర్ఫీదుని ఇచ్చారు. వివిధ సమస్యలకు పరిష్కారాలను కోడింగ్ ద్వారా యానిమేషన్ రూపంలో విద్యార్థులు వివరించారు. ఈ ప్రాజెక్టుకి ప్రిన్సిపల్ లావణ్య పూర్తి సహాయ సహకారాలు ప్రోత్సాహాన్ని అందించారు. రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో గెలిచినందుకుగాను అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ వారు పాఠశాలను విద్యార్థులను ఉపాధ్యాయురాలిని అభినందిస్తూ ఒక టీవీ, రెండు లాప్టాప్స్ రెండు టాబ్స్, నాలుగు సర్టిఫికెట్స్ ఒక షీల్డ్ అందించారు. విద్యార్థులను సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్ జే.చంద్రశేఖర్, జిసిడిఓ డాక్టర్ కలేషా బేగం అభినందించారు.

షార్ట్ సర్క్యూట్ తో కోళ్ల ఫారం లో మంటలు...

-9 షెడ్లు అగ్నికి ఆహుతి - 5 లక్షల పైనే ఆస్తి నష్టం

ప్రభుత్వమే ఆదుకోవాలి : విశాఖ జిల్లా బ్యాక్ అధ్యక్షులు శ్రీనివాసరావు



విశాలాంధ్ర -అనందపురం: మండలంలో ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంద పురం గ్రామపంచాయతీలో కొట్యాడ .శ్రీను కోళ్ల ఫారం లో సాయంత్రం 5 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన మంటలు చెల్లరేగినట్టు అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు . సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అగ్నిమాపక అధికారులు సహాయంతో రాత్రి 7 గంటల వరకు అదుపు చేసినట్లు చెప్పారు. అయితే 9 షెడ్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయని సుమారు 5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని, ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంబంధించిన లేదని తెలుస్తోంది. తాసిల్దార్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకుస్థానిక విఆర్ఓ అప్పారావు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలన చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పుస్తక ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని రాజకీయ శాస్త్రం , ప్రజా పరిపాలన విభాగంలో గురువారం డాక్టర్ విజయ్ చంద్ర రాసిన "రాజీవ్ గాంధీ జీవితం - దర్శనికుడు" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జార్జ్ విక్టర్ హాజరుయారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ఎయు రాజకీయ శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రేమానందం, కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జీవితం మరియు దర్శనికతను గురించి తెలియజేసారు . కాంగ్రెస్ పార్టీకి గాంధీ కుటుంబం చేసిన అసంఖ్యాక త్యాగాలకు దేశం ఎప్పటికి రుణపడి ఉంటుందన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ దేశం అనేక రంగాలలో అభివృద్ధి చెందిందని, ఉన్నత విద్యా సంస్థలు దేశంలో నెలకొల్పిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఇరిగేషన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, హరిత విప్లవం, భూ సంస్కరణలు,ఉపాధి హామి, పేదలకు ఇళ్లు, రైతులకు రుణమాఫీ, అభివృద్ధి, సంక్షేమాన్ని ఒక తాటిపై నడిపించిన చరిత్ర కాంగ్రెస్ కి ఉందన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ ది అని ప్రియాంక అన్నారు.

వైభోపేతంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు, ప్రధాన అర్చకులు అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదేశాల మేరకు ఏ.ఈ.ఓ ఆనంద్ కుమార్ పర్యవేక్షణలో అర్చక స్వాములు వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపము లో వేదికపై అధీష్టింపజేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన ఆర్జిత సేవలు నేత్రపర్వంగా జరిగాయి. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవ మూర్తి గోవింద రాజ స్వామిని మండపంలో అధిష్టింప జేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళా శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రథం ఫిట్ నెస్ ను తనిఖీ చేసిన ఆర్ & బి ఈఈ

విశాలాంధ్ర -సింహాచలం: ఈనెల ఎనిమిదో తేదీన జరిగే శ్రీ స్వామి వార్షిక తిరు కళ్యాణము సందర్భంగా ఇంచార్జీ కార్యనిర్వహణాధికారి కె .సుబ్బారావు సూచనల మేరకు గురువారం స్వామివారి రథమును ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విద్యాసాగర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు , పాండు రంగారావు ఏ. ఇ, రథము యొక్క ఫిట్నెస్ ను పరిశీలించారు వీరితో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు బండారు రాంబాబు ఏఈ సూరిబాబు అసిస్టెంట్ ఇంజనీర్ లోకేష్ రవికుమార్ తదితరులు ఉన్నారు

113 మందికి ఎంఐజీ ప్లాట్ల కేటాయింపు

విశాలాంధ్ర-విశాఖ : అద్దూరు, గరివిడి, పాలవలసల్లోని ఎంఐజీ లే అవుట్లు లోని ప్లాంట్లకు గురువారం నిర్వహించిన 4వ విడత ఈ-లాటరీలో 113 మంది దరఖాస్తుదారులకు ప్లాట్లను కేటాయించారు. మధ్య తరగతి ప్రజల కోసం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ ఎంఐజీ లే అవుట్లను అభివృద్ధి చేశారు. అనకాపల్లి జిల్లాలోని అద్దూరులో 19.99 ఎకరాల్లో 146 ప్లాట్లను, విజయనగరం జిల్లా గరివిడి గ్రామంలో 21.30 ఎకరాల విస్తీర్ణంలో 212 ప్లాట్లను, విశాఖ జిల్లా పాలవలస గ్రామంలో 76.96 ఎకరాల విస్తీర్ణంలో 472 ప్లాట్లను వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో మురుగు నీటి శుద్ధి వ్యవస్థ, భూగర్భ మురుగు కాలువలు, బీటీ, సీసీ రహదారులు, తాగునీటి సదుపాయం, పార్కు వంటి ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి లేఅవుట్ లో 10 శాతం ప్లాట్లు ప్రభుత్వ ఉద్యోగులకు, 5 శాతం ప్లాట్లు ప్రభుత్వ పెన్షనర్లకు కేటాయిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగస్థులకు కేటాయించిన ధరలో 20 శాతం రాయితీ ఇస్తున్నారు. అద్దూరు, గరివిడి, పాలవలసలే అవుట్లలో 472 ప్లాట్లకు 226 ప్లాట్లను కేటాయిం చారు. ఈ కార్యక్రమం లో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్లానింగ్ అధికారి చామంతి, జె.పి.ఓ. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.